క్లుప్తంగా

ఆశా కార్యకర్తల నియామకానికి ఇంటర్వ్యూలు

కనగానపల్లి: మండలంలోని కనగానపల్లి, తూంచర్ల గ్రామాల్లో ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. కనగానపల్లి ఆశా కార్యకర్త పోస్టుకు 8 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో ఏడుగురు ఇంటర్వ్యూకు హాజరైనట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఇక తూంచర్ల ఆశా పోస్టుకు 5 మంది దరఖాస్తు చేసుకోగా ఇద్దరు మాత్రమే హాజరైనట్లు తెలిపారు.

ల్యాప్‌టాప్ అప్పగింత



వస్తువులను అందజేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి: అనంతపురం నగరానికి చెందిన తేజశ్విని బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం బెంగళూరు నుంచి అనంతపురానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరారు. బస్సులో నిద్రించిన ఆమె మార్గమధ్యంలోని రాప్తాడు వద్ద మేల్కొని చూడగా ల్యాప్‌టాప్,లగేజీ బ్యాగులు కనిపించకపోవడంతో వెంటనే తన సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. తర్వాత సోదరుడితో కలసి చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎస్‌ఐ సత్యనారాయణ చెన్నేకొత్తపల్లిలో ఉత్సవాలు జరుగుతుండటంతో మైక్ ద్వారా విషయాన్ని అనౌన్స్ చేయించారు. కొద్ది నిమిషాల తరువాత బెంగళూరుకు చెందిన ఓ వ్యక్తి ల్యాప్‌టాప్, లగేజీ బ్యాగ్‌ను చెన్నేకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాడు. తర్వాత వాటిని బాధితురాలికి అందజేశారు.

అధైర్యపడొద్దు.. బాసటగా ఉంటాం

- బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట భరోసా



అరవిందరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



బుక్కపట్నం మండలం కొండాపురంలో కుళ్లాయప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: అధైర్యపడొద్దు..బాసటగా ఉంటామని పలువురు బాధిత కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ధైర్యం చెప్పారు. రెడ్డిపల్లికి చెందిన మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ (40), బసిరెడ్డిపల్లికి చెందిన చంద్రాయుడు (62), బాపనకుంట ఎస్సీ కాలనీ చెందిన శేషం ఆదిలక్ష్మమ్మ (60), చిరంజీవి (30) వేర్వేరు కారణాలతో ఇటీవల మృతి చెందారు. దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం మృతుల ఇళ్లవద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి ఇంటివద్ద కోలుకొంటున్న బసిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత అరవిందరెడ్డి, రెడ్డిపల్లికి చెందిన ముక్తాపురం రమణారెడ్డి భార్య ప్రమీలమ్మ, బాపనకుంట ఎస్సీ కాలనీకి చెందిన చందు, అనారోగ్యంతో బాధ పడుతున్న బాపనకుంటకు చెందిన బడా చెన్నారెడ్డిని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట మండల కన్వీనర్ చిట్టిబాల ఆదినారాయణరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పారకల రమణ, మాజీ కన్వీనర్ కే. సూర్యనారాయణ, మండల అగ్రిబోర్డ్ మాజీ చైర్మెన్ రఘునాథరెడ్డి, సర్పంచ్‌లు ప్రసాద్, కుళ్లాయప్ప, బొజ్జేనాయక్, యర్ర సూరి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రాజేంద్రనాయక్, యూత్ విభాగం మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు చిన్నాగప్ప, రామక్రిష్టారెడ్డి, వెంకటేష్‌నాయక్, ఓబిరెడ్డి, శ్రీరాములునాయక్, రాజమోహన్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, టీడీ చక్రధర్ రెడ్డి తదితరులున్నారు.

బాధితులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పుట్టపర్తి: మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోమవారం వివిధ కారణాలతో మృతి చెందిన, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన పార్టీ నాయకులు, సానుభూతి పరుల కుటుంబాలను పరామర్శించారు. బుక్కపట్నం మండలం నార్శింపల్లిలో మాజీ స్టోర్ డీలర్, వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులు తల్లి అక్కమ్మ, నార్శింపల్లి తండాకు చెందిన సంతోష్ కుమార్‌నాయక్ మృతి చెందారు. మాజీ ఎమ్మెల్యే వారి ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రమాదవశాత్తు గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న నార్శింపలికి చెందిన పార్టీ నేత మోహన్‌ను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదే గ్రామంలో ప్రమాదంలో గాయపడిన గాలి కిష్టప్పను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో భాదపడుతున్న ఇదే గ్రామానికి చెందిన పార్టీ నేత వెంకట్రాముడి కుమార్తె చందనతోపాటు సీనియర్ నేత చెన్నమనాయుడును పరామర్శించారు. అనంతరం అనారోగ్యంతో భాదపడుతున్న లకలగడ్డపల్లికి చెందిన ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి భార్య అరుణమ్మను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన కొండాపురానికి చెందిన బీసీ సెల్ నాయకుడు కుళ్లాయప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొత్తకోట కేశప్ప, ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, సర్పంచ్ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు



ధర్మవరం అర్బన్: కొత్తపేటలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

తాడిమర్రి: తాడిమర్రిలో జరుగుతున్న మొహర్రం వేడుకల్లో భాగంగా సోమవారం భక్తిశ్రద్ధలతో పీర్లను జలధికి తీసుకెళ్లారు. తెల్లవారు జామున 4.00 గంటలకే ముల్లాసాబ్ ముత్తుజా పీర్లకు నూతన వస్త్రాలు ధరింపజేసి, వెండి గొడుగులను తొడిగి, వివిధ రకాల పుష్పమాలలతో అందంగా అలంకరించి పూజలు చేశారు.

తలుపుల: మండలవ్యాప్తంగా సోమవారం మొహర్రం వేడుకల్లో భాగంగా జలధి కార్యక్రమం జరిగింది. ఆయా గ్రామాల్లో పీర్లను ఘనంగా ఊరేగించారు. అనంతరం సమీపంలోని వంకల్లో తీసుకెళ్లి జలధి కార్యక్రమం నిర్వహించారు.

ధర్మవరం అర్బన్: ధర్మవరం పట్టణంలోని పలు వార్డుల్లో మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు వార్డుల్లో పెద్ద సరిగెత్తుతోపాటు అగ్నిగుండ ప్రవేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

కనగానపల్లి: కనగానపల్లి, ముక్తాపురం, తగరకుంట, మామిళ్లపల్లిలో సోమవారం మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రధాన ఘట్టమైన జలధి కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా పీర్ల స్వాములను అగ్నిగుండ ప్రవేశం చేయించి ఊరేగింపుతో జలధికి తరలించారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



మక్బూల్ అహ్మద్‌ను సన్మానిస్తున్న లోకేశ్వరరెడ్డి, నాయకులు

కదిరి టౌన్: వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం కృషి చేద్దామని బీఎస్ మక్బూల్ అహ్మద్ నాయకులకు పిలుపునిచ్చారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన న్యాయవాది లింగాల లోకేశ్వర్‌రెడ్డి మక్బూల్ అహ్మద్‌ను పూలమాల, దుశ్శాలువాతో సన్మానించారు. ఈసందర్భంగా మక్బూల్ అహ్మద్ మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండలాల కన్వీనర్లు షేక్ బాబ్జాన్, రవికుమార్‌రెడ్డి, మణికంఠనాయక్, రవీంద్రరెడ్డి, ఆశోక్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నమో నారసింహా..



స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చెన్నేకొత్తపల్లిలో శ్రీ ఓబుళ లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున స్వామి వారి ఊరేగింపు దేవాలయానికి చేరుకుంది.ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నమో నారసింహ.. గోవిందా గోవింద అని స్మరించుకున్నారు. సోమవారం మధ్యాహ్నం ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు సహపంక్తి భోజనం(దాసంగం) ఏర్పాటు చేశారు. ఎర్రజిన్నన్నగారిపల్లిలో తొలి ఏకాదశి ఉత్సవాలలో భాగంగా నృసింహస్వామికి ప్రత్యేక పూజలు, స్వామి వారి పరుషను నిర్వహించారు.

సీపీఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ధర్మవరం అర్బన్: సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు కోరారు. సోమవారం పట్టణంలోని శివానగర్ శివాలయం నుంచి పట్టణ పురవీధుల్లో సీపీఐ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

ధర్మవరం అర్బన్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి ఎంఐఎస్ డేటా అనలిస్ట్, ఫైనాన్సియల్ సర్వీసెస్ కోర్సును ప్రారంభిస్తున్నామన్నారు. పదో తరతి, ఇంటర్ పాస్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్, డిగ్రీ బీఏ, బీకాం చేసి ఆసక్తి ఉన్న యువతి, యువకులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 9182288465 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు

తనకల్లు: మండ్లిపల్లి సమీపంలో సోమవారం బైక్‌పై నుంచి పడడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కదిరి పట్టణానికి చెందిన మహమ్మద్ అబుజార్, తన్వీర్ బైక్‌పై నుంచి కొక్కంటి క్రాస్ వైపు నుంచి వస్తుండగా గ్రామం వద్దకు రాగానే వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ప్రమాదంలో అబుజార్‌కు కుడి కాలుకు బలమైన గాయాలయ్యాయి. తన్వీర్ తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోట చౌడమ్మ ఆలయం వెనుక సోమవారం పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశామని వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. వారి నుంచి రూ.15,210 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

తాడిమర్రి: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏపీఎం సాంబశివుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులివెందుల పట్టణానికి చెందిన ఆదిత్య బిర్లా గార్మెంట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. 18 ఏళ్ల వయస్సు నిండి 35 ఏళ్ల వయసులోపు మహిళలు మాత్రమే అర్హులు అన్నారు. జీతం రూ.9,181, నెలవారి హాజరును బట్టి రూ.1,000 బోనస్ ఉంటుందన్నారు. అలాగే ఉచితంగా టైలరింగ్ ట్రైనింగ్ ఇస్తారని పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

తల్లీబిడ్డల అప్పగింత

ధర్మవరం అర్బన్: భర్తతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయిన తల్లి, ఇద్దరు పిల్లలను భర్తకు అప్పగించామని టూ టౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. వివరాలు.. పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన రామకృష్ణ ఆదివారం తన భార్య యర్రమ్మతో గొడవపడ్డాడు. మనస్థాపం చెందిన యర్రమ్మ తన కుమారుడు నందకిషోర్, కూతురు వసంతికను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు తల్లి, పిల్లల కోసం పోలీసులు గాలించారు. బళ్లారి సమీపంలో రైల్వేస్టేషన్‌లో ఉన్నట్లు గుర్తించి, దర్మవరం తీసుకొచ్చి అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

అనంతపురం: నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులో లక్ష్మీ టిఫెన్ సెంటర్ ఎదురుగా సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన వి. ఈశ్వరయ్య (54) రోడ్డు దాటుతుండగా , గుర్తు తెలియని స్కూటీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీతాలు చెల్లించాలని నిరసన

తాడిమర్రి: ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు సోమవారం నిరసన తెలిపారు. స్థానిక మద్దులచెర్వు రోడ్డులోని సత్యసాయి తాగునీటి సరఫరా సంపు వద్ద కొండపాకు నడిపి ఓబిలేసు, బాలం లక్ష్మీరెడ్డి, ఆదినారాయణ తదితరులు ఒంటికాలుపై నిలుచుకుని నిరసన తెలిపారు.

'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నేడు

నల్లమాడ: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఉదయం 8:30 గంటలకు వైఎస్సార్ కూడలిలో 'బాబు షూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అతిథిగా హాజరవుతారన్నారు.

వివాహిత అదృశ్యం

కదిరి అర్బన్: కాలేపల్లిలో ఓ వివాహిత అదృశ్యమైంది. వివరాలు.. గ్రామానికి చెందిన శీనా భార్య సాయిలీల ఈనెల 1న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించినా ప్రయోజనం లేకపోయింది. దీంతో శీనా సోమవారం కదిరి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు అర్ధనగ్నంగా నిరసన తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ 36 ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ,ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలన్నారు.

రసాభాసగా టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

నల్లచెరువు: స్థానిక గీతా మందిరంలో నిర్వహించిన టీడీపీ గ్రామ కమిటీ విస్తృతస్థాయి సమావేశం రసాభాసగా మారింది. టీడీపీ మండల కన్వీనర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం మండల స్థాయి గ్రామ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలు పరిష్కారం కావడం లేదని టీడీపీ నాయకులను నిలదీశారు. తమ సొంత పనులు, అధికారుల బదిలీలపై ఎమ్మెల్యేకు తెలియజేయగా ఆయన పీఏ రమణకు వాటిని పరిష్కరించాలని చెబుతున్నారన్నారు. అయితే పీఏ తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తొలి ఏకాదశి పూజలు

కొత్తచెరువు: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం పాతదేవరపల్లిలో లక్ష్మీచెన్నకేశవ స్వామిని మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

ఎంఈఓను బదిలీ చేయాలి

కదిరి టౌన్: గత 15 ఏళ్ల నుంచి కదిరి ఎంఈఓగా కొనసాగుతున్న చెన్నకృష్ణను బదిలీ చేయాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు పీఎస్‌ఎఫ్‌ఐ, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు ధర్నా చేపట్టారు. నాయకులు అరుణ్, ఉపేంద్ర మాట్లాడుతూ ఐదేళ్లకు మించి ఏ ప్రభుత్వ ఉద్యోగి ఒకే చోట ఉండడానికి ఉద్యోగం చేయడానికి వీలులేదని, కాని ఎంఈఓ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం చేస్తున్నారన్నారు.

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

పుట్టపర్తి: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈసందర్భంగా యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొననున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

బత్తలపల్లి: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్, నియోజకవర్గ కల్చరల్ వింగ్ ప్రెసిడెంట్ షరబ్ యోగానందా ఆచారీ, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు బత్తలపల్లిలోని నాలుగు రోడ్ల కూడలిలో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు.

తనకల్లు: స్థానిక కొత్త గ్రామ సచివాలయం భవనం వద్ద దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ జయంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అశోక్‌రెడ్డి సోమవారం తెలిపారు.

గాండ్లపెంట: స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి సోమవారం తెలిపారు. అనంతరం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

తలుపుల: మండల కేంద్రంలోని మూడు రోడ్లకూడలి వద్ద వైఎస్సార్ జయంతిని మంగళవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ డి. పయాజ్ అహమ్మద్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

కనగానపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ సర్కిల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే వైఎస్సార్ జయంతి కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ నాగముని పిలుపునిచ్చారు.

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్ జయంతి వేడుకలు మంగళవారం చెన్నేకొత్తపల్లిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్ డోలా రామచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి, ఎంపీపీ అంజలిటో ప్రకటనలో తెలిపారు.

కదిరి టౌన్: పట్టణంలో మంగళవారం ఉదయం నిర్వహించనున్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలకు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎస్ మక్బూల్ అహ్మద్ కోరారు. మున్సిపల్ ఆఫీస్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యక్రమం జయంతి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు.